సాక్షి
ప్రకాశం
సోమవారం । 18 । ఆగస్టు । 2025



బొప్పాయి రైతు బేజారు

గత మే నెలలో పెనుగాలుల జీభత్సానికి జిల్లాలోని పశ్చిమ ప్రకాశంలో వందలాది ఎకరాల బొప్పాయి పంట నేలకొరిగింది. రైతులకు నష్టపరిహారం అందలేదు. - 8లో..



రోడ్డెక్కని ఫోర్‌లైన్ పనులు

ఒంగోలు–బేస్తవారిపేట ఫోర్‌లైన్ రోడ్డు నిర్మాణం ప్రతిపాదనలకే పరిమితమైంది. ఏడాది నుంచి దానిపై ఎటువంటి చర్యలు లేవు. - 8లో..

గరిష్ఠం/కనిష్ఠం
30 /27

వాతావరణం

ఆకాశం పాక్షికంగా మేఘావృతమై ఉంటుంది. ఒకటి రెండు చోట్ల ఉరుములు, మెరుపులతో జల్లులు పడవచ్చు.

న్యూస్‌రీల్

పారా సిట్టింగ్ వాలీబాల్ వరల్డ్ కప్‌నకు విజయకుమార్ ఎంపిక



వేల్పుల విజయ్‌కుమార్

దర్శి: పారా క్రీడల్లో ఒకటైన పారా సిట్టింగ్ వాలీబాల్ వరల్డ్ కప్–2025 పోటీలకు దర్శి పట్టణానికి చెందిన వేల్పుల విజయకుమార్ ఎంపికయ్యారు. అక్టోబర్ 8 నుంచి 18 వ తేదీ వరకు అమెరికాలో జరగబోయే పారా సిట్టింగ్ వాలీబాల్ వరల్డ్ కప్ పోటీల్లో విజయ్‌కుమార్ పాల్గొననున్నారు. దీనికి సంబంధించి పారా ఒలింపిక్ ఆఫ్ ఇండియా నుంచి అధికారిక లేఖ అందినట్లు వేల్పుల విజయకుమార్ తెలిపారు. గతంలో 2023 లో కజకిస్థాన్ దేశంలో జరిగిన ఆసియన్ జోన్ పారా సిట్టింగ్ వాలీబాల్ పోటీల్లో భారతదేశం తరఫున విజయ్‌కుమార్ పాల్గొన్నారు. రెండోసారి భారతదేశం తరఫున ఆడటానికి అవకాశం రావడం చాలా సంతోషంగా ఉందని తెలిపారు. అవకాశం కల్పించిన ఆంధ్రప్రదేశ్ పారా సిట్టింగ్ వాలీబాల్ అసోసియేషన్ కు ధన్యవాదాలు తెలిపారు.

మద్యం, మైనింగ్ మాఫియాల ఆగడాలను అరికట్టాలి



మాట్లాడుతున్న రంగసాయిరెడ్డి

మార్కాపురం: రాష్ట్రంలో మద్యం, మైనింగ్ మాఫియాల ఆగడాలను అరికట్టాలని ప్రజా సంకల్ప వేదిక జాతీయ అధ్యక్షుడు మధిర రంగసాయిరెడ్డి ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఆదివారం మార్కాపురంలోని వారి కార్యాలయంలో దక్షిణ కోస్తా జిల్లాల ముఖ్యనాయకులతో విస్తృత స్థాయి సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రస్తుతం రాష్ట్రంలో జరుగుతున్న అవినీతిని నిర్మూలించేందుకు అందరూ ముందుకు రావాలని అన్నారు. రాజకీయ చైతన్యంతోనే రాజ్యాంగ ఫలాలు అన్నీ వర్గాలకు అందుతాయని అన్నారు. గ్రామ స్థాయి నుంచి ప్రజా సంకల్ప వేదికకు పునాదులు వేయాలన్నారు. మార్కాపురం మెడికల్ కాలేజీ శిథిలావస్థకు చేరుతోందని ఆవేదన వ్యక్తం చేశారు. వెలుగొండ ప్రాజెక్టు పనులు నత్తనడకన సాగుతున్నాయని అన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న అన్నీ వర్గాల ప్రజలను ప్రజా సంకల్ప వేదికలోనికి ఆహ్వానించాలని రంగసాయిరెడ్డి సూచించారు.


ఊళ్లపాలెం వ్యాయామ ఉపాధ్యాయుడు సస్పెండ్


సింగరాయకొండ: ఊళ్లపాలెం వ్యాయామ ఉపాధ్యాయుడుగా పనిచేస్తున్న పిల్లి హజరత్తయ్యను సస్పెండ్ చేసినట్లు డీఈఓ కిరణ్‌కుమార్ ఆదేశాలు జారీ చేశారని ఎంఈఓ–1 కత్తి శ్రీనివాసరావు తెలిపారు. ఇటీవల హజరత్తయ్యపై నకిలీ ధ్రువపత్రాలతో వ్యాయామ ఉపాధ్యాయుడుగా విధులు నిర్వహిస్తూ ప్రభుత్వాన్ని మోసం చేశారని, విద్యార్థినులపై లైంగిక వేధింపులకు పాల్పడ్డారన్న ఆరోపణలు రావటంతో కలెక్టర్ తమీమ్ అన్సారియా త్రీమెన్ కమిటీ వేసి విచారణ చేశారు. కమిటీ ఇచ్చిన నివేదిక ఆధారంగా ఆయన విద్యార్థిని పట్ల అసభ్యంగా ప్రవర్తించాడన్న ఆరోపణలు రుజువుకావటంతో కలెక్టర్ ఆదేశాలతో హజరత్తయ్యను సస్పెండ్ చేసినట్లు వివరించారు.

రెవెన్యూ అధికారుల నిర్లక్ష్యంతో సుమారు ఆరు గ్రామాల రైతులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. అధికారులు తమ వ్యవసాయ పట్టా భూములను రెవెన్యూ రికార్డులు, ఆన్‌లైన్‌లో నిషేధిత, ప్రభుత్వ భూములుగా నమోదు చేయడంతో వారు అవస్థలు పడుతున్నారు. అధికారులు చేసిన తప్పిదాన్ని మరోసారి పరిశీలించి రైతులకు న్యాయం చేయాలని కొన్ని నెలలుగా ఆయా గ్రామాల రైతులు రెవెన్యూ అధికారులకు మొరపెట్టుకుంటున్నా పట్టించుకునే వారు కరువయ్యారు.

పట్టా భూములపై నిషేధిత కత్తి

తిమ్మపాలెంలో నిషేధిత భూమిగా నమోదైన పట్టా భూమి





ఆన్‌లైన్‌లో రెవెన్యూ అధికారులు నమోదు చేసిన నిషేధిత భూముల జాబితా

- అధికారుల నిర్లక్ష్యం..రైతులకు శాపం
- చెరుకూరు రెవెన్యూ పరిధిలో పట్టా భూములు నిషేధిత భూములుగా నమోదు
- ఆరు గ్రామాల్లో సుమారుగా 1500 సర్వే నంబర్లలోని 4 వేల ఎకరాలు నమోదు చేసిన అధికారులు
- తీవ్ర ఇబ్బందులు పడుతున్న రైతులు
- విన్నవించినా పట్టించుకోని రెవెన్యూ అధికారులు, మంత్రి స్వామి

పొన్నలూరు: రెవెన్యూ అధికారులు నిర్లక్ష్యంతో రైతుల సొంత భూములపై ఉన్న హక్కులను ఇబ్బందుల్లోకి నెట్టారు. పొన్నలూరు మండలం చెరుకూరు రెవెన్యూ పరిధిలో తిమ్మపాలెం, చెరుకూరు, ముండ్లమూరివారిపాలెం, రామన్నపాలెం, శివన్నపాలెం, వెంకుపాలెం గ్రామాలు ఉన్నాయి. చెరుకూరు రెవెన్యూ పరిధిలోని 15వ సర్వే నంబర్ నుంచి 1398 సర్వే నంబర్ వరకు సుమారు 4 వేల ఎకరాలకు పైగా రైతుల వ్యవసాయ పట్టా భూములు ఉన్నాయి. భూములన్నీ రైతులకు వారసత్వంగాను, కొనుగోలు ద్వారా పక్కాగా పట్టా భూములుగా ఉన్నాయి. 2017లో అప్పటి టీడీపీ ప్రభుత్వంలో నిషేధిత, ప్రభుత్వ భూములను గుర్తించేందుకు ప్రత్యేక కార్యక్రమం చేపట్టారు. ఈ క్రమంలో ఈ పట్టా భూములను స్థానిక రెవెన్యూ అధికారులను క్షేత్ర స్థాయిలో విచారించి నిషేధిత భూములు ఉంటే గుర్తించాలని అప్పటి ప్రభుత్వం ఆదేశించింది. రెవెన్యూ అధికారులు నిషేధిత, ప్రభుత్వ భూములను గుర్తించే క్రమంలో పొరపాటున లేదా కావాలనే చేశారో.. ఏమైందో ఏమోగానీ ఈ వ్యవసాయ భూముల్లోని సుమారు కొన్ని వేల ఎకరాలను ఆరు గ్రామాల రైతులకు తెలియకుండా రెవెన్యూ రికార్డులు, ఆన్‌లైన్‌లో నిషేధిత, ప్రభుత్వ భూములుగా నమోదు చేశారు. దీంతో గత టీడీపీ ప్రభుత్వంలో రెవెన్యూ అధికారులు చేసిన తప్పిదం వలన రైతులు నేడు ఇబ్బందులు పడుతున్నారు.

అవస్థలు పడుతున్న రైతులు:

ఆరు గ్రామాలకు చెందిన రైతుల వ్యవసాయ పట్టా భూములను నిషేధిత, ప్రభుత్వ భూములుగా నమోదు చేయడం వలన 2017 నుంచి ఇప్పటి వరకు రైతులు పలు విషయాల్లో తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. వ్యవసాయ పెట్టుబడుల కోసం బ్యాంకులు నుంచి రుణాలు పొందాలంటే ఆన్‌లైన్‌లో నిషేధిత భూములుగా ఉండటంతో వ్యక్తిగత రుణాలు తీసుకోలేకపోతున్నారు. అలాగే ప్రభుత్వం నుంచి వచ్చే వ్యవసాయ రాయితీలు, పథకాలు సక్రమంగా పొందలేకపోతున్నారు. ప్రధానంగా రైతులు వారి ఆర్థిక పరిస్థితుల దృష్ట్యా తమ పట్టా భూములను అమ్ముకోవాలన్నా, కొనుగోలు చేయాలన్నా వీలు పడక తీవ్ర అవస్థలు పడుతున్నారు.

విన్నవించినా పట్టించుకోవడం లేదు

భూముల సమస్యపై కొన్ని నెలలుగా జిల్లా నుంచి, స్థానిక అధికారుల దృష్టికి ఆయా గ్రామాల రైతులు అర్జీల రూపంలో సమస్యను తెలియజేస్తున్నా..ఒక్కరు కూడా పట్టించుకున్న పాపాన పోలేదు. అలాగే స్థానిక మంత్రి స్వామికి విన్నవించినా ఫలితం శూన్యమని రైతులు వాపోతున్నారు. ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించి సమస్యను పరిష్కరించాలని రైతులు కోరుతున్నారు.

కొన్ని నెలలుగా ఇబ్బందులు పడుతున్నాం



చెరుకూరు రెవెన్యూ పరిధిలోని తిమ్మపాలెం గ్రామంలో నాకు సర్వే నంబర్ 709లో 8 ఎకరాలు, 710లో 3 ఎకరాల పట్టా భూమి ఉంది. అయితే 2017 గత టీడీపీ ప్రభుత్వంలో రెవెన్యూ అధికారులు నిషేధిత, ప్రభుత్వ భూములను గుర్తించే క్రమంలో నా పట్టా భూములను నిషేధిత భూములుగా నమోదు చేశారు. దీంతో వ్యవసాయ పెట్టుబడి కోసం బ్యాంక్ రుణాలు పొందలేకపోతున్నాను. అలాగే కొందరు రైతులు తమ ఆర్థిక ఇబ్బందుల దృష్ట్యా క్రయ, విక్రయాలకు వీలు పడటం లేదు. దీనిపై ఉన్నతాధికారులు స్పందించి సమస్యను పరిష్కరించి రైతులను ఆదుకోవాలి.

– బూసిరెడ్డి శ్రీనివాసులురెడ్డి, రైతు, తిమ్మపాలెం

డీఎల్‌ఎస్‌సీ కమిటీ ద్వారా పరిష్కరించవచ్చు



పొన్నలూరు మండలంలో వ్యవసాయ పట్టా భూములు ఉన్న వారికి సరైన అర్హత పత్రాలు ఉండి నిషేధిత భూములుగా నమోదైతే డీఎల్‌ఎస్‌సీ కమిటీ ద్వారా సమస్యను పరిష్కరించవచ్చు. అయితే తిమ్మపాలెం గ్రామంలో అటవీ భూములు ఉండటంతో పాటు సంబంధిత రెవెన్యూ రికార్డులు తప్పుల తడకగా ఉండటం వలన ఇబ్బందులు వస్తున్నాయి. పక్కాగా పట్టా భూములు కలిగి ఉండి నిషేధిత, ప్రభుత్వ భూములుగా నమోదైతే ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లి సమస్యను పరిష్కరిస్తాం.

– పుల్లారావు, తహసీల్దార్, పొన్నలూరు

కెమెరా ట్రాప్‌లో చిరుత



గూడెం పరిసరాల్లో సంచరిస్తూ ట్రాప్ట్ కెమెరాలో చిక్కిన చిరుత



గూడెం వాసులకు జాగ్రత్తలు చెప్తున్న ఫారెస్టు రేంజి అధికారి

- ట్రాప్ కెమెరాలో చిక్కిన బాలికపై దాడి చేసిన చిరుత
- చిన్నారుట్ల గిరిజన గూడెం పరిసరాల్లోనే సంచారం
- మరుసటి రోజే లేగ దూడలపై దాడి చేసి చంపిన చిరుత
- మేటింగ్ సమయంలో రోడ్లపైనే సంచరిస్తున్న వన్యప్రాణులు

పెద్దదోర్నాల: మండల పరిధిలోని చిన్నారుట్ల గిరిజన గూడెంలో మూడేళ్ల బాలిక కుడుముల అంజమ్మపై దాడి చేసిన చిరుత ఎట్టకేలకు కెమెరా కంటికి చిక్కింది. గత బుధవారం తల్లిదండ్రులతో కలిసి ఇంట్లో నిద్రిస్తున్న చిన్నారిపై చిరుతపులి దాడి చేసి గాయపర్చిన సంఘటన పాఠకులకు విదితమే. ఈ సంఘటనతో అటవీశాఖ ఉన్నతాధికారులు చిన్నారుట్ల గూడెంలో ఐదుగురు ప్రొటెక్షన్ వాచర్లను ఏర్పాటు చేయటంలో పాటు గూడెం చుట్టూ 15 ట్రాప్డ్ కెమెరాలు ఏర్పాటు చేశారు. ఈ నేపథ్యంలో శనివారం రాత్రి గూడెం చుట్టూ ఏర్పాటు చేసిన కెమెరాలో చిరుత సంచారం నిక్షిప్తమైంది. చిన్నారుట్ల గూడెం పరిసరాల్లో సంచరిస్తున్న చిరుత గూడెంలోని రెండు లేగ దూడలపై కూడా దాడి చేసి వాటిని చంపినట్లు గిరిజనులు పేర్కొంటున్నారు. ఆయా సంఘటనలతో అప్రమత్తమైన అటవీశాఖ అధికారులు ఆదివారం చిన్నారుట్ల గిరిజన గూడెంలో పర్యటించారు. ఈ సందర్భంగా పెద్దదోర్నాల ఫారెస్టు రేంజి అధికారి హరి గూడెంవాసులకు పలు సూచనలు చేశారు. రాత్రి వేళల్లో చెంచు గిరిజనులు బయట తిరగకుండా అప్రమత్తంగా ఉండాలని ఆయన సూచించారు.

గిరిజనులు అప్రమత్తంగా ఉండాలి..

నల్లమల అభయారణ్యంలో పులుల సంతతి పెరిగేందుకు తీసుకున్న చర్యల్లో భాగంగా పులులకు ఆహారంగా ఉపయోగపడే జింకలు, దుప్పులు, అడవి పందుల పెరుగుదలకు మూడు నెలల పాటు అభయారణ్యంలో ప్రవేశించటాన్ని అధికారులు నిషేధించారు. జూలై 1వ తేదీ నుంచి సెప్టెంబర్ 30వ తేదీ వరకు పులుల మేటింగ్‌కు అనుకూలమైన వాతావరణం. దట్టమైన అభయారణ్యంలోని నిషిద్ధ ప్రాంతాల్లోకి పర్యాటకులు, ప్రజలు వెళ్లకుండా కట్టుదిట్టమైనా చర్యలు తీసుకుంటున్నారు. సాధారణంగా ఈ సమయం పూర్తిగా వర్షాకాలం కాబట్టి కురిసిన వర్షాలతో అడవి అంతా పచ్చబడి దట్టమైన చెట్లు, పొదలతో నిండి ఉంటుంది. ఈ కాలంలోనే పెద్దపులులు తాము జత కట్టిన పులితో ప్రశాంతతో సంచరిస్తుంటాయి. దీని వల్ల అభయారణ్యంలో నివసించే చెంచు గిరిజనులు ఈ సమయంలోనే కాస్తంత అప్రమత్తంగా ఉండాలని అటవీశాఖ అధికారులు పేర్కొంటున్నారు.

రాత్రివేళ జాగ్రత్తగా ఉండండి..

చిన్నారుట్ల గూడెం వాసులు అప్రమత్తంగా ఉండాలని పెద్దదోర్నాల ఫారెస్టు రేంజి అధికారి హరి పేర్కొంటున్నారు. గత బుధవారం గూడెంలోని బాలికపై దాడికి పాల్పడినట్లుగా భావిస్తున్న చిరుత గూడెం చుట్టే తిరుగుతున్నట్లు కెమెరా ట్రాపుల్లో నిక్షిప్తమైంది. ఈ నేపథ్యంలో గూడేనికి చెందిన గిరిజనులు రాత్రి వేళల్లో జాగ్రత్తగా ఉండాలన్నారు. చిరుత సంచారానికి సంబంధించి సమాచారాన్ని ఉన్నతాధికారులకు నివేదించినట్లు ఆయన తెలిపారు. రాత్రి వేళల్లో గూడెం చుట్టూ తమ సిబ్బంది నిరంతర పెట్రోలింగ్ ఉంటుందని, గూడెం వాసులు ధైర్యంగా ఉండాలని ఆయన కోరారు.

ఘనంగా నాగభైరవ పురస్కార ప్రదానోత్సవం



సినీ నటుడు రఘుబాబును సన్మానిస్తున్న నిర్వాహకులు

ఒంగోలు మెట్రో: ప్రముఖ కవి డాక్టర్ నాగభైరవ కోటేశ్వరరావు పేర ఏటా ఇస్తున్న నాగభైరవ సాహిత్య పీఠం పురస్కారాల ప్రదానోత్సవాన్ని ఆదివారం ఒంగోలులోని రెడ్‌క్రాస్ భవనంలో నిర్వహించారు. ముఖ్యఅతిథిగా పాల్గొన్న సినీ నటుడు రఘుబాబు మాట్లాడుతూ నాగభైరవ కోటేశ్వరరావును తాను చిన్నప్పుడు తాత అని పిలిచేవాడినంటూ ఆయనతో తమ కుటుంబానికి ఉన్న అనుబంధాన్ని గుర్తుచేసుకున్నారు. ప్రజానాట్యమండలి నాయకుడు నల్లూరి వెంకటేశ్వర్లు, మాజీ ఎమ్మెల్యే ఈదర హరిబాబు మాట్లాడుతూ ఏటా క్రమం తప్పకుండా నాగభైరవ కోటేశ్వరరావు పేరిట రచయితలకు పురస్కారాలు ప్రదానం చేయడం సముచితంగా ఉందని అన్నారు. కళామిత్రమండలి అధ్యక్షుడు డాక్టర్ నూనె అంకమ్మరావు మాట్లాడుతూ నాగభైరవ కోటేశ్వరరావు కదిలించే కవిత్వాన్ని కళ్లముందుంచి, కవిత్వమే ఊపిరిగా బతికారని అన్నారు. పద్యాన్ని, గద్యాన్ని సమపాళ్లలో రంగరించి రచనలు చేసిన గొప్ప సాహితీవేత్త నాగభైరవ అని కొనియాడారు. సాహిత్యపీఠం చేస్తున్న సేవను వీరవల్లి సుబ్బారావు అభినందించారు. కుర్రా ప్రసాద్ బాబు నాగభైరవతో తన పరిచయాన్ని వివరించారు. అనువాద ప్రక్రియలో పురస్కారాలు పొందిన రాచపాళెం చంద్రశేఖరరెడ్డి (నెత్తురు నది), కోనేరు కల్పన (దర్పణం)లకు వరుసగా రూ.10 వేలు, రూ.5 వేలు చొప్పున నగదు బహుమతులను నిర్వాహకులు అందించారు. కేకేఎల్ స్వామికి నాగభైరవ కళా పురస్కారం రూ.10 వేలు, నాగభైరవ ఆత్మీయ పురస్కారం పొందిన గిరిబాబు తరఫున ఆయన కుమారుడు రఘుబాబుకు ప్రదానం చేశారు. కార్యక్రమంలో కవులు, రచయితలు డాక్టర్ బీరం సుందరరావు, చుండి బేబీ సుజాత, కె.బాలకోటయ్య, వి.ఝాన్సీదుర్గ, బీరం అరుణ, సింహాద్రి జ్యోతిర్మయి, కేపస్వీ ప్రసాద్, పోతినేని వెంకటేశ్వర్లు, బెజవాడ రామారావు, డాక్టర్ నాగభైరవ ఆంజనేయులు తదితరులు పాల్గొన్నారు.

నీరున్నా నిష్ఫలం

- సాగర్ జలాలు సముద్రానికి
- సాగునీరు విడుదల చేయక ఆయకట్టుదారుల ఆందోళన
- జిల్లాకు సాగర్ జలాలు చేరి 20 రోజులు

త్రిపురాంతకం: కృష్ణమ్మ బిరబిరా పరుగులెడుతోంది. నదీ పరివాహంలోని జలాశయాలు నిండు కుండల్లా దర్శనమిస్తున్నాయి. అయినా సాగర్ రైతుల సాగునీటి కష్టాలు తీరే పరిస్థితులు కనిపించడం లేదు. సాగర్ జలాలు ప్రధాన కాలువ ద్వారా ప్రకాశం జిల్లాకు విడుదల చేసినా నేటికీ మేజర్లకు సాగునీటిని విడుదల చేయకపోవడంతో రైతాంగం మండిపడుతున్నారు. నాగార్జున సాగర్ ప్రధాన కాలువ ద్వారా సాగునీరు విడుదల చేసి దాదాపు 20 రోజులు కావస్తోంది. జిల్లాలో గత నెల 30న సాగర్ జలాలు ప్రధాన కాలువ ద్వారా సరఫరా అయ్యాయి. ఒంగోలు రామతీర్థం జలాశయానికి నీరందించిన వెంటనే సాగునీరు విడుదల చేస్తారని రైతాంగం ఎదురు చూసినా అదిజరగలేదు. సాగర్ అధికారుల చుట్టూ రైతులు సాగునీటి విడుదల కోసం ప్రదక్షిణ చేస్తున్నారు. ప్రభుత్వం నుంచి నీటి విడుదలపై ఎలాంటి నిర్దిష్టమైన ప్రకటన చేయలేదు. సాగునీటి విడుదలకు ఇంకా ఎన్నిరోజులు చూడాలని అన్నదాతలు ప్రశ్నిస్తున్నారు.

జలాశయాలు నిండాయి.. సాగర్ జలాలు సాగరానికి

కృష్ణానది పరివాహంలో ఉన్న ఆల్మట్టి, నారాయణ్‌పూర్, జూరాల, శ్రీశైలం, నాగార్జున సాగర్ జలాశయాలు నిండుకుండల్లా దర్శనమిస్తున్నాయి. గత నెల నుంచి జలాశయాల్లోని నీటిని తగ్గించేందుకు పలు దఫాలు గేట్లు తెరచి దిగువకు విడుదల చేశారు. సాగర్ జలాలు సముద్రం పాలవడం తప్ప జలాశయాల ద్వారా సాగునీరు అందించే పరిస్థితులు కనిపించడం లేదు. అధికారులను నీటి విడుదలపై ప్రశ్నిస్తే సమాధానం లేదు. వృథాగా సముద్రం వైపు పరుగులు తీస్తున్న నీటిని వినియోగించుకునే పరిస్థితుల్లో ప్రభుత్వం లేకపోవడంపై ప్రజలు విమర్శిస్తున్నారు. వృథా అవుతున్న నీటి ద్వారా సాగర్ పరివాహంలోని నోటిఫైడ్ చెరువులు, నాన్‌నోటిఫైడ్ చెరువులు, కుంటలు నింపితే కనీసం వాటి పరిధిలో భూగర్భ జలాలు పెరిగి బోర్లకు నీరు సమృద్ధిగా వచ్చేది.



సాగర్ ప్రధాన కాలువ ద్వారా జిల్లాకు విడుదలవుతున్న సాగర్ జలాలు

సాగర్ జలాలు విడుదలై 20 రోజులు.. నారుకు నీరులేదు

సాగర్ జలాలు విడుదలై 20 రోజులు గడిచినా సాగుకు నీరందించకపోవడంతో రైతులు పంటలు వేసుకోవాలా లేదా అన్న అనుమానంతో ఉన్నారు. సాగునీరు లేక పోవడంతో సాగర్ కాలువల దిగువన నారుమళ్లు పోసుకునే పరిస్థితులు సన్నగిల్లాయి. కేవలం బోర్ల కింద అక్కడక్కడా నార్లు పోసుకునేందుకు రైతులు సమాయత్తమవుతున్నారు. సాగునీరు వీలున్నంత తొందరగా విడుదల చేస్తే నారుమళ్లు పోసుకుంటామని అన్నదాతలు చెబుతున్నారు.



సాగునీరు విడుదలకాని మేజర్ కాలువ



మైనర్ కాలువ ద్వారా నీరందక నారుకు నోచుకోని భూములు

ప్రభుత్వ విద్యాలయాల్లో రాజకీయ వేదికలా.



ప్రభుత్వ ఉన్నత పాఠశాల ఆవరణలో ఏఎంసీ ప్రమాణ స్వీకారోత్సవం సందర్భంగా మిగిలిన వంటలను జేసీబీతో గుంటలు తీసి అందులో వేసిన దృశ్యం

- విద్యాశాఖా మంత్రీ మీకు కనిపిస్తుందా...లేదా?
- లోకేష్‌ను ప్రశ్నించిన మాజీ మంత్రి డాక్టర్ ఆదిమూలపు సురేష్

సింగరాయకొండ: మీరు ఇచ్చిన జీఓలను మీరే తుంగలో తొక్కి విద్యాలయాలను రాజకీయాలకు వేదికలుగా మారుస్తున్నారని, జీఓలు, ఉత్తర్వులు ఆచరించటానికి కాదు...కేవలం ప్రతిపక్షాలను అణగ తొక్కటానికేనా అని వైఎస్సార్ సీపీ నియోజకవర్గ ఇన్‌చార్జి, పీఏసీ సభ్యుడు, మాజీ మంత్రి డాక్టర్ ఆదిమూలపు సురేష్ విద్యాశాఖా మంత్రి నారా లోకేష్‌ను ప్రశ్నించారు. ప్రభుత్వ జూనియర్ కాలేజీ, ప్రభుత్వ ఉన్నత పాఠశాల ప్రాంగణంలో కొండపి వ్యవసాయ మార్కెటింగ్ యార్డు చైర్మన్ ప్రమాణ స్వీకారోత్సవ కార్యక్రమం నిర్వహించటంపై మండల కేంద్రంలోని పార్టీ క్యాంపు కార్యాలయంలో ఆదివారం ఆయన మీడియాతో మాట్లాడుతూ కూటమి ప్రభుత్వ పనితీరుపై ఘాటుగా స్పందించారు. డాక్టర్ సురేష్ మాట్లాడుతూ ప్రభుత్వం జారీ చేసే జీఓలు, ఉత్తర్వులు, చట్టాలన్నీ ప్రతిపక్షాలకే తప్ప మీరు ఆచరించటానికి కాదా అని ప్రశ్నించారు. ప్రభుత్వ జూనియర్ కాలేజీ క్రీడా మైదానంలో ఏఎంసీ ప్రమాణ స్వీకారోత్సవ కార్యక్రమం కోసం మూడు రోజులుగా విద్యార్థులు ఆడుకోవటానికి వీలు లేకుండా ఏర్పాట్లు చేస్తూ మైదానంలో గుంటలు తవ్వి ధ్వంసం చేశారని అన్నారు. కార్యక్రమానికి ఇద్దరు మంత్రులు హాజరవటం దేనికి సంకేతమని ప్రశ్నించారు. సాక్షాత్తు నంబరు 2 గా చెప్పుకునే లోకేష్‌కు చెందిన విద్యాశాఖలోనే ఈ విధంగా ఉల్లంఘనలు జరగటం దారుణమన్నారు. నాడు–నేడు కింద పాఠశాలలను అభివృద్ధి చేస్తే రాజకీయాల కోసం ఆ పాఠశాలలను వాడుకుంటూ లక్షలాది రూపాయలతో బాగు చేసిన మైదానాలు విద్యార్థులకు పనిరాకుండా చేయటమేనా ముందడుగు అని ప్రశ్నించారు. మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పాఠశాల క్రీడామైదానాల చుట్టూ కాంపౌండ్‌వాల్ కట్టి భద్రపరిస్తే కూటమి ప్రభుత్వ నాయకులు మాత్రం వాటిని రాజకీయ వేదికలుగా మారుస్తున్నారని ఆరోపించారు. చివరికి కార్యక్రమం సందర్భంగా పక్కనే ఉన్న ప్రభుత్వ ఉన్నత పాఠశాల ఆవరణలోనే వంటలు వండటంతో పాటు మిగిలిన అన్నం, వంటకాలను ఆ పాఠశాల ఆవరణలోనే జేసీబీతో గుంటలు తీసి పోశారని ఆరోపించారు. ప్రస్తుతం క్రీడా మైదానాలను రాజకీయ వేదికలుగా మారుస్తున్నారని, ఇక ముందు పాఠశాల ఫర్నిచర్‌ను కూడా రాజకీయ సమావేశాలకు వాడినా ఆశ్చర్యం లేదన్నారు. ఇదేనా పాఠశాలలను అభివృద్ధి చేయటం అని చినబాబును ప్రశ్నించారు. దీనిపై రాష్ట్ర విద్యా శాఖ సెక్రటరీ కూన శశిధర్, విద్యాశాఖ కమిషనర్ రామరాజు, కలెక్టర్ తమీమ్ అన్సారియా, డీఈఓ కిరణ్‌కుమార్‌కు వాట్సప్ ద్వారా ఫిర్యాదు చేసినట్లు వివరించారు.

క్లుప్తంగా

బైకులు ఢీకొని వృద్ధుడు మృతి

తాళ్లూరు: రెండు బైకులు ఢీకొని వృద్ధుడు మృతి చెందిన సంఘటన తాళ్లూరు మండలంలోని సోమవరప్పాడు గ్రామంలో ఉన్న పోలేరమ్మ ఆలయ సమీపంలో ఆదివారం చోటుచేసుకుంది. శివరాంపురం గ్రామానికి చెందిన గోనుగుంట చిన సుబ్బారావు అలియాస్ బాబూరావు (74) కొన్ని సంవత్సరాల క్రితం తూర్పుగంగవరం వచ్చి స్థిరపడ్డాడు. శివరాంపురం వద్ద ఉన్న పొలాన్ని చూసేందుకు ఆదివారం తన బైక్‌పై వెళ్తున్న సమయంలో ఎదురుగా మరో బైక్‌పై వచ్చిన యువకులు ఢీకొట్టారు. దీంతో రోడ్డు వెంట ఉన్న బ్రిడ్జిపై పడి సుబ్బారావు మృతి చెందారు. అయితే, ఈ ఘటనపై ఆదివారం రాత్రి వరకూ తమకు ఎటువంటి ఫిర్యాదు అందలేదని పోలీసులు తెలిపారు.

అనారోగ్యంతో రైతు ఆత్మహత్య

సంతనూతలపాడు (చీమకుర్తి రూరల్): అనారోగ్యంతో రైతు ఆత్మహత్య చేసుకున్న సంఘటన సంతనూతలపాడులో ఆదివారం చోటుచేసుకుంది. స్థానిక జెర్సీ డెయిరీ సమీపంలో నివాసం ఉంటున్న కామినేని హరిబాబు (46) అనే యువకుడు ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. హరిబాబు వ్యవసాయం చేసుకుంటూ జీవనం సాగిస్తున్నాడు. అనారోగ్య కారణాలతో పాటు అప్పుల బాధతో ఆత్మహత్యకు పాల్పడినట్లు సంతనూతలపాడు ఎస్సై అజయ్ కుమార్ తెలిపారు. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు చెప్పారు. మృతునికి ఇద్దరు పిల్లలున్నారు.

వల్లూరమ్మ దేవస్థానానికి ఫిక్స్‌డ్ డిపాజిట్లపై కొటేషన్ల ఆహ్వానం

టంగుటూరు: జిల్లాలోని ప్రసిద్ధిగాంచిన వల్లూరమ్మ దేవస్థానానికి సంబంధించిన ఫిక్స్‌డ్ డిపాజిట్ల మీద అత్యధిక వడ్డీ రేటు కోసం బ్యాంకర్ల నుంచి కొటేషన్లు కోరుతున్నామని ఆలయ కార్యనిర్వహణాధికారి రమేష్ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈఓ మాట్లాడుతూ 18వ తేదీ ఉదయం 11 గంటలకు కొటేషన్లు స్వీకరిస్తారని, ఆసక్తి కలిగిన బ్యాంకర్లు కొటేషన్లు ఇవ్వాలని కోరారు. పూర్తి వివరాలకు 7013429148 నంబరును సంప్రదించాలన్నారు.

- నష్టపరిహారం అందక ఆందోళన
- పశ్చిమ ప్రకాశంలో వందలాది ఎకరాల్లో దెబ్బతిన్న బొప్పాయి తోటలు
- ఆదుకోని కూటమి ప్రభుత్వం
- పెట్టుబడి కోసం కూడా తిప్పలు పడుతున్న రైతన్నలు


కొండారెడ్డిపల్లిలో కుప్పకూలిన బొప్పాయి తోటను పరిశీలిస్తున్న హెచ్‌ఓ, ఏడీ (ఫైల్)

బొప్పాయి రైతు బేజారు

తర్లుపాడు: శ్రమనే నమ్ముకుని జీవనం సాగిస్తున్న రైతన్నను ప్రకృతి కకావికలం చేయగా, ఆదుకుని అండగా నిలవాల్సిన ప్రభుత్వం కాలయాపన చేస్తూ కొర్రీలు పెడుతోంది. దీంతో బొప్పాయి రైతు పరిస్థితి అగమ్యగోచరంగా మారింది. గత మే నెలలో పెనుగాలుల బీభత్సానికి పశ్చిమ ప్రకాశంలోని తర్లుపాడు, మార్కాపురం, కొనకనమిట్ల, పొదిలి, కురిచేడు, బేస్తవారిపేట, కంభం తదితర మండలాల్లో వందలాది ఎకరాల్లో చేతికొచ్చిన బొప్పాయి పంట నేలకూలింది. నష్టపరిహారం కోసం ఎదురుచూస్తున్న రైతన్నలకు నిరాశ నిస్పృహలు తప్పడం లేదు. క్షేత్రస్థాయిలో అధికారులు పర్యటించి నష్టాన్ని అంచనా వేసి నివేదిక రూపొందించి ప్రభుత్వానికి పంపారు. కానీ, నాలుగు నెలలైనా నష్టపరిహారం డబ్బులు అందకపోవడంతో రైతన్నలు పెట్టుబడుల కోసం వడ్డీ వ్యాపారులను ఆశ్రయిస్తున్నారు. ప్రభుత్వ సహాయం అందితే కొంతలో కొంత ఉపశమనం కలుగుతుందని భావించినప్పటికీ కూటమి ప్రభుత్వం ఆ దిశగా చర్యలు చేపట్టకపోవడంతో రైతన్నలు ఆందోళనకు గురవుతున్నారు.

మండలాల వారీగా బొప్పాయి పంట నష్టం వివరాలు...

మండలం	నష్టపోయిన రైతులు	ఎకరాలు
తర్లుపాడు	90 మంది	190
పొదిలి	60 మంది	90
మార్కాపురం రూరల్	20 మంది	35

అడ్వాన్స్ తిరిగిచ్చేశాను



మే మొదటి వారంలో బొప్పాయి అమ్మేందుకు కాంట్రాక్టర్ల దగ్గర నుంచి అడ్వాన్స్ తీసుకున్నాను. మరో రెండు రోజుల్లో కోత కోస్తామనగా భారీగా వీచిన గాలులు, వర్షానికి నాలుగు ఎకరాల్లో పంట మొత్తం నేలపాలైంది. ఆరు లక్షలకుపైగా పెట్టుబడి పెట్టాను. ఎరువుల షాపులో అప్పులు ఇప్పటికీ అలాగే ఉన్నాయి. అధికారులు వచ్చి అంచనా వేశారు. కానీ ఇప్పటివరకూ డబ్బులు రాలేదు. ప్రస్తుత సీజన్‌లో పెట్టుబడికి డబ్బులు దొరక్క అగచాట్లు పడుతున్నాం.

– భాస్కర్‌రెడ్డి, రైతు, రాగసముద్రం

ఐదు లక్షలు నష్టపోయా



మూడు ఎకరాల్లో బొప్పాయి పంట సాగుచేశా. గత మే నెలలో వీచిన పెనుగాలులకు పంట మొత్తం నేలకూలింది. అప్పులు చేసి పెట్టుబడిగా పెట్టాను. రూ.5 లక్షలు నష్టపోయాను. అధికారులు వచ్చి నష్టం అంచనా వేశారు. కానీ పరిహారం ఇంకా అందలేదు.

– తాడి కాశిరెడ్డి, రైతు, రాగసముద్రం

పంట మొత్తం పోయింది



గత మే నెలలో వీచిన పెనుగాలులు, భారీ వర్షానికి మూడు ఎకరాల్లో బొప్పాయి పంట మొత్తం కుప్పకూలిపోయింది. ఒక్క కోత కూడా కోయలేదు. సుమారు నాలుగున్నర లక్షలకు పైగా పెట్టుబడి పెట్టాను. ప్రభుత్వం త్వరగా నష్టపరిహారం అందించకపోతే పూర్తిగా మునిగిపోతాం.

– జగన్, రైతు, ఓబాయిపల్లి

రవాణా కార్మికులను చిన్నచూపు చూస్తున్నారు

- కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలపై ఆలిండియా రోడ్ ట్రాన్స్‌పోర్ట్ వర్కర్స్ ఫెడరేషన్ జిల్లా ప్రధాన కార్యదర్శి శ్రీనివాసులు ఆగ్రహం
- 24న ఫెడరేషన్ రాష్ట్ర మహాసభలను జయప్రదం చేయాలని పిలుపు


విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న నాయకులు

ఒంగోలు టౌన్: రవాణా రంగం కార్మికులను కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు చిన్నచూపు చూస్తున్నాయని, బీఎన్ఎస్ చట్టంతో కార్మికుల జీవితాలను సంక్షోభంలో పడేశాయని ఆలిండియా రోడ్ ట్రాన్స్‌పోర్ట్ వర్కర్స్ ఫెడరేషన్ జిల్లా ప్రధాన కార్యదర్శి గంటేపల్లి శ్రీనివాసులు ఆగ్రహం వ్యక్తం చేశారు. ఆదివారం స్థానిక కొత్త కూరగాయల మార్కెట్ వద్ద ఉన్న సీఐటీయూ కార్యాలయంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. కేంద్ర ప్రభుత్వం మోటారు వాహనాల చట్టం, బీఎన్ఎస్ చట్టాలను తీసుకొచ్చి కార్మికులను కోలుకోని దెబ్బతీసిందని చెప్పారు. కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాల కార్మిక వ్యతిరేక విధానాలపై జిల్లాలో ఉద్యమం జరుగుతోందని తెలిపారు. పోలీసులు, ఆర్టీఓల వేధింపులకు వ్యతిరేకంగా అనేక పోరాటాలు చేపట్టడం జరిగిందన్నారు. ఈ క్రమంలో ఒంగోలులో ఫెడరేషన్ రాష్ట్ర మహాసభలు నిర్వహించాలని నిర్ణయం తీసుకున్నట్లు వివరించారు. నగరంలోని ఆటో కార్మికులకు పర్మినెంట్ స్టాండ్ ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. స్థానిక కాపు కళ్యాణ మండపంలో మహాసభలు ప్రారంభమవుతాయని తెలిపారు. ఫెడరేషన్ ఆలిండియా ప్రధాన కార్యదర్శి జనాబ్‌దేవ్, జాతీయ ఉపాధ్యక్షుడు ఆర్.లక్ష్మయ్య, రాష్ట్ర అధ్యక్షుడు ఎస్.శివాజీ, ముజఫర్ అహ్మద్, కె.దుర్గారావు తదితరులు పాల్గొంటారని తెలిపారు. సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు కాలం సుబ్బారావు మాట్లాడుతూ దేశంలోని కార్మిక వర్గంపై అణచివేత కొనసాగుతోందని చెప్పారు. కార్మిక కోడ్లతో ప్రాథమిక హక్కులు ప్రమాదంలో పడ్డాయని చెప్పారు. దేశంలో రవాణా రంగం చాలా కీలకమైనదని, రవాణా రంగం ఆగిపోతే దేశం స్తంభిస్తుందని చెప్పారు. కార్మిక హక్కుల సాధన కోసం ఐక్య పోరాటాలు చేపడతామన్నారు. సమావేశంలో కార్మిక సంఘ నాయకులు తంబి శ్రీనివాసరావు, దాసరి మల్లికార్జునరావు, మున్వర్ బాషా తదితరులు పాల్గొన్నారు.

పుస్తక మహోత్సవంలో చిన్నారుల సందడి



బాలల సాహిత్యాన్ని ఆవిష్కరిస్తున్న సాహితీవేత్తలు, పగిలిన గాజు పెంకుల మీద నడుస్తున్న మహిళ

ఒంగోలు టౌన్: స్థానిక పీవీఆర్ హైస్కూల్ ఆవరణలో నిర్వహిస్తున్న పుస్తక మహోత్సవంలో ఆదివారం మూడో రోజు చిన్నారుల సందడి కనిపించింది. ఆదివారం సెలవు రోజు కావడంతో పెద్ద సంఖ్యలో విద్యార్థులు, చిన్నారులు, తల్లిదండ్రులు, ఉద్యోగులు, సాహితీ ప్రియులు తరలివచ్చారు. పిల్లల కథల పుస్తకాలు, కామిక్స్, యాక్టివిటీ పుస్తకాలను పిల్లలు కొనుగోలు చేశారు. నేషనల్ బుక్ ట్రస్ట్ ఆధ్వర్యంలో మంజులూరు కృష్ణకుమారి, సీఏ ప్రసాద్ పర్యవేక్షణలో చిన్నారులకు సృజనాత్మక రచన వర్క్‌షాప్ నిర్వహించారు. దాదాపుగా 40 మంది చిన్నారులు ఈ వర్క్‌షాపులో ఉత్సాహంగా పాల్గొన్నారు. కొందరు చిన్నారులు కథలు రాయగా, మరికొందరు పిల్లలు తమకు నచ్చిన బొమ్మలు గీసి అభినందనలు అందుకున్నారు. అనంతరం ఎన్‌బీటీ ప్రచురించిన బాలల సాహిత్యం జుజూరానా, మంచిమిత్రులు, షేరా–మిత్తు, బుజ్జి గుడ్లగూబ, బాలు అండ్ తోకల కథలను ఆవిష్కరించారు. ప్రముఖ రచయిత నాగభైరవ ఆదినారాయణ అధ్యక్షత వహించగా ఎన్‌బీటీ దక్షిణ భారత ఇన్‌చార్జి పత్తిపాక మోహన్ ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం జరిగింది. కేంద్ర సాహిత్య అకాడమీ అవార్డు గ్రహీత గంగిశెట్టి శివకుమార్ పుస్తకాలను ఆవిష్కరించారు. తదనంతరం జరిగిన చర్చా వేదికలో జాయింట్ కలెక్టర్ ఆర్.గోపాలకృష్ణ ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. వేదికలో తమను ప్రభావితం చేసిన పుస్తకాల గురించి జిల్లా ప్రముఖులు ప్రసంగించారు.

ఆకట్టుకున్న మ్యాజిక్ షో...

శాస్త్రీయ సమాజం కోసం పోరాడుతున్న జన విజ్ఞాన వేదిక నిర్వహించిన ఇంద్రజాల ప్రదర్శన చిన్నారులను విశేషంగా ఆకట్టుకుంది. గాజు పెంకుల మీద నడవడం, మేకుల మీద నిలబడటం వంటి ప్రదర్శలు ఆలోచనలు రేకెత్తించాయి. పగిలిన గాజు పెంకుల మీద ఎలాంటి గాయాలు కాకుండా నడుస్తుంటే చిన్నారులు ఆశ్చర్యంతో తిలకించారు. కార్యక్రమంలో నల్లూరి వెంకటేశ్వర్లు, బుచ్చిబాబు, రవికుమార్, ఉదయ కిరణ్, కె.లక్ష్మయ్య, రహంతుల్లా, చిలకమర్తి పద్మజ, రహ్మనుద్దీన్ తదితరులు పాల్గొన్నారు.

ఆటో ఢీకొని రెండు గేదెలు మృతి


ప్రమాదంలో మృతి చెందిన గేదెలు

నాగులుప్పలపాడు: ఆటో ఢీకొని రెండు గేదెలు మృతిచెందిన సంఘటన ఆదివారం రాత్రి నాగులుప్పలపాడు మండలంలోని ఉప్పుగుండూరులో నాగన్నవాగు చెక్ డ్యాం సమీపంలో జరిగింది. బాపట్ల జిల్లా పెదగంజాంకు చెందిన ఒకే కుటుంబం వారు ట్రాలీ ఆటోలో కామేపల్లి గుడికి వెళ్లి తిరిగి స్వగ్రామానికి వెళ్తున్నారు. నాగన్నవాగు చెక్ డ్యాం వద్దకు వచ్చేసరికి చీకట్లో గేదెలు ఎదురురావడంతో కనిపించక ఆటో ఢీకొట్టింది. దాంతో రెండు గేదెలు అక్కడికక్కడే మృతి చెందాయి. వాటి విలువ సుమారు రూ.2 లక్షలు ఉంటుందని బాధితులు తెలిపారు. ఈ ప్రమాదంలో ఆటోలో ప్రయాణిస్తున్న వారు క్షేమంగా బయటపడి ఊపిరి పీల్చుకున్నారు.

పెండింగ్ కేసులు పరిష్కరించాలి


మద్దిపాడు పోలీస్ స్టేషన్‌ను తనిఖీ చేస్తున్న ఎస్పీ దామోదర్, పక్కన డీఎస్పీ, సీఐ, ఎస్ఐ

- మద్దిపాడు పోలీస్‌స్టేషన్‌ను ఆకస్మికంగా తనిఖీ చేసిన ఎస్పీ దామోదర్

మద్దిపాడు: పెండింగ్ కేసులన్నింటినీ వేగంగా పరిష్కరించాలని ఎస్పీ ఏఆర్ దామోదర్ ఆదేశించారు. మద్దిపాడు పోలీస్‌స్టేషన్‌ను ఆదివారం ఆకస్మికంగా ఆయన తనిఖీ చేశారు. స్టేషన్‌ను, పరిసరాలను క్షుణ్ణంగా పరిశీలించారు. స్టేషన్ నిర్వహణపై ఎస్ఐ శివరామయ్యకు సలహాలు, సూచనలు చేశారు. 2020 నుంచి రికార్డులు పరిశీలించి పెండింగ్ కేసులు, మిస్సింగ్ కేసుల వివరాలడిగి తెలుసుకున్నారు. రికార్డుల నిర్వహణ సక్రమంగా ఉండాలని ఎస్ఐని ఆదేశించారు. అనంతరం స్టేషన్లోని ఫోన్లను పరిశీలించారు. డయల్100కు వచ్చే కాల్స్ విషయంలో సిబ్బంది ఏ విధమైన చర్యలు తీసుకుంటున్నారో పరిశీలించారు. స్టేషన్ను, పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని సూచించారు. ఎస్పీ వెంట డీఎస్పీ ఆర్.శ్రీనివాసరావు, ఒంగోలు రూరల్ సీఐ శ్రీకాంత్ ఉన్నారు.

క్రీడలతో ఆత్మవిశ్వాసం

- ఎస్పీ ఏఆర్ దామోదర్



కరాటే పోటీల్లో విజేతలను అభినందిస్తున్న ఎస్పీ దామోదర్

ఒంగోలు టౌన్: క్రీడలు క్రమశిక్షణతో పాటు మరింత ఆత్మవిశ్వాసాన్ని పెంపొందిస్తాయని ఎస్పీ ఏఆర్ దామోదర్ అన్నారు. ఆదివారం స్థానిక మినీ స్టేడియంలో సిద్ధార్థ కరాటే డు అకాడమీ ఆధ్వర్యంలో నిర్వహించిన 43వ అంతర్జాతీయ కరాటే పోటీలను ఆయన ప్రారంభించారు. దేశ వ్యాప్తంగా 12 రాష్ట్రాల నుంచి తరలివచ్చిన 700 మంది క్రీడాకారులు పాల్గొన్న ఈ పోటీలను ప్రకాశం జిల్లాలో నిర్వహించడం సంతోషాన్ని కలిగించిందన్నారు. కరాటే వంటి మార్షల్ ఆర్ట్స్ క్రీడాకారులకు శారీరక దృఢత్వంతో పాటుగా మానసిక స్థైర్యాన్ని కలిగిస్తాయని చెప్పారు. జాతీయ స్థాయిలో వివిధ ప్రాంతాలు, విభిన్న సంస్కృతుల నుంచి వచ్చిన క్రీడాకారులతో పరస్పర అవగాహన కలిగించడమే కాకుండా స్నేహాన్ని పెంపొందిస్తాయన్నారు. క్రీడలతో చెడు అలవాట్లను దూరంగా పెట్టవచ్చని చెప్పారు. జిల్లాకు చెందిన క్రీడాకారులు అద్భుతమైన నైపుణ్యాన్ని కనబరిచి జిల్లాకు మంచి పేరు తీసుకురావాలని చెప్పారు. తల్లిదండ్రులు పిల్లలను చదువుతో పాటు క్రీడల్లో కూడా ప్రోత్సహించాలని సూచించారు. క్రీడల్లో రాణించిన విద్యార్థులకు మంచి భవిష్యత్తు ఉంటుందని, దేశానికి సేవ చేసే అవకాశం కూడా లభిస్తుందని చెప్పారు. కార్యక్రమంలో డీఎస్పీ రాయపాటి శ్రీనివాసరావు, తాలూకా సీఐ విజయకృష్ణ, టూటౌన్ సీఐ మేడా శ్రీనివాసరావు, కరాటే అసోసియేషన్ నాయకులు నల్లూరి మోహన్, విద్యా సంస్థల అధిపతి నల్లూరి వెంకటేశ్వర్లు, మండవ మురళీకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

- ప్రతిపాదనలకే పరిమితమైన ఒంగోలు – బేస్తవారిపేట ఫోర్ లైన్ రోడ్డు నిర్మాణం
- 113 కిలోమీటర్ల పొడవున నిర్మించాల్సి ఉండగా, ఏడాది నుంచి అతీగతీ లేని వైనం
- ప్రజల నుంచి తీవ్రస్థాయిలో విమర్శలు
- చీమకుర్తిలో ఎటువైపు నిర్మిస్తారనే విషయంపై పెద్ద ఎత్తున చర్చలు

రోడ్డెక్కని ఫోర్ లైన్ పనులు!


ఒంగోలు - కర్నూలు రోడ్డులోని చీమకుర్తి మెయిన్ రోడ్డు

చీమకుర్తి: అదిగో ఫోర్‌లైన్.. ఇవిగో నిధులు అంటూ కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చినప్పటి నుంచి ఒంగోలు–బేస్తవారిపేట ఫోర్ లైన్ రోడ్డు నిర్మాణం గురించి ఊదరగొడుతున్నారు. కానీ, ప్రతిపాదనల దశ దాటి ఒక్క అడుగు కూడా ముందుకు పడకపోవడంతో ప్రభుత్వం తీరుపై ప్రజల నుంచి తీవ్రస్థాయిలో విమర్శలు వ్యక్తమవుతున్నాయి. పాలకులు, అధికారుల అధ్వానపు పనితీరు కారణంగానే ఫోర్ లైన్ పనులు రోడ్డెక్కలేదని ఆరోపిస్తున్నారు. ప్రస్తుతం ఒంగోలు సమీపంలోని ఎస్ఎస్ఎన్ కాలేజీ వద్ద 8వ కిలోమీటరు వరకు ఒంగోలు–కర్నూలు రోడ్డు ఫోర్ లైన్ నిర్మాణం జరిగి ఉంది. ఒంగోలు నుంచి 9వ కిలోమీటరు నుంచి బేస్తవారిపేట వరకు సంతనూతలపాడు, చీమకుర్తి, పొదిలి, కనిగిరి, మార్కాపురం, కంభం, బేస్తవారిపేట ఆర్అండ్‌బీ రోడ్డు మీదుగా దాదాపు 113 కిలోమీటర్ల మేర ఫోర్ లైన్‌ను నిర్మించేందుకు ప్రభుత్వం నిర్ణయించింది. ఒంగోలు నుంచి బేస్తవారిపేట వరకు మూడు దశలలో సర్వేలు నిర్వహించి ఏది ఉత్తమమో పరిశీలించనున్నారు. ప్రభుత్వ భూమి, ప్రైవేటు వ్యక్తుల నుంచి సేకరించాల్సిన భూమి ఎంతెంత ఉంటుందో లెక్కలు కట్టనున్నారు. ఎన్ని వంతెనలు, ఎన్నెన్ని బైపాస్‌లు, ఎన్ని టోల్ ప్లాజాలు పెడితే పెట్టిన ఖర్చు ఎంత కాలంలో వసూలు చేసుకునే వీలుంటుందనే పలు అంశాలపై సర్వేలు పూర్తయిన తర్వాత ఫోర్‌లైన్‌కు టెండర్లు పిలిచే అవకాశాలున్నాయి. ప్రతిపాదనలు, సర్వే పనుల్లోనే తీవ్ర జాప్యం నెలకొనడంతో ఇక రోడ్డు నిర్మాణ పనులు మొదలయ్యేది ఎప్పుడో.. పూర్తయ్యేది ఎప్పుడోనని ప్రజలు నిట్టూరుస్తున్నారు. ప్రభుత్వ నత్తనడక తీరును విమర్శిస్తున్నారు.

చీమకుర్తి బైపాస్ వైపే ఫోర్ లైన్ ఎక్స్‌టెన్షన్‌కు ప్రతిపాదనలు...

చీమకుర్తి పట్టణానికి ఊరు వెలుపుల సాగర్ కాలువ కట్ట మీదుగా ఇప్పటికే డబుల్ లైన్ బైపాస్ ఉంది. దాన్నే ఫోర్ లైన్‌గా విస్తరించేందుకు ప్రతిపాదనలు సిద్ధం చేసినట్లు తెలిసింది. చీమకుర్తి బైపాస్‌ను సాగర్‌కాలువకు ఉత్తరం వైపున్న కాలువ కట్టపై నిర్మించి ఉన్నారు. దానికి అదనంగా మరో డబుల్ లైన్ వేస్తే సరిపోతుందని భావిస్తున్నారు. వాస్తవానికి ఫోర్‌లైన్ నిర్మాణానికి డివైడర్‌కు ఇరువైపులా 7 మీటర్ల చొప్పున రెండువైపులా కలిసి 14 మీటర్లు కావాల్సి ఉంది. డివైడర్‌కు మరో రెండు మీటర్లు, ఇరువైపులా రోడ్డు మార్జిన్‌లకు మరో రెండు మీటర్ల చొప్పున 4 మీటర్లు కావాల్సి ఉంది. ఆ లెక్కన ఫోర్‌లైన్‌కు దాదాపు 20 మీటర్లు.. అంటే 60 అడుగుల వెడల్పున ఫోర్ లైన్ నిర్మించాల్సి ఉంది. చీమకుర్తి బైపాస్‌లో ఇప్పటికే డబుల్ లైన్ ద్వారా రోడ్డు 7 మీటర్ల వెడల్పులో, రెండుపక్కల మార్జిన్‌లుగా దాదాపు ఇరువైపులా 3 మీటర్లు ఉంది.

ఇక ఫోర్‌లైన్‌కు అదనంగా 10 మీటర్లు.. అంటే 30 అడుగుల స్థలం కావాల్సి ఉంది. ఇప్పుడున్న బైపాస్ మార్జిన్‌ను ఆనుకుని పలు భవనాలు, వ్యాపార సముదాయాలు, పెట్రోల్ బంకులు వంటి నిర్మాణాలు ఉన్నాయి. దాదాపు 30 అడుగుల మేర ఫోర్‌లైన్‌కు చీమకుర్తి బైపాస్‌లో స్థలాన్ని సేకరించాల్సి ఉంది. ఆ లెక్కన బైపాస్‌లో విలువైన భవనాలు, ఇంటి స్థలాలు, పొలాలు రోడ్డు విస్తరణలో కోల్పోయే ప్రమాదం ఉంది. దీంతో చీమకుర్తి పట్టణ వాసులు కొంత మంది చీమకుర్తి మెయిన్‌రోడ్డులోనే పట్టణంలో నుంచి ఫోర్‌లైన్ నిర్మిస్తే పట్టణం డివైడర్లతో అందంగా ఉంటుందని అంటున్నారు. దాని వలన పట్టణం, వ్యాపార సముదాయాలు అందంగా రూపుదిద్దుకుని అభివృద్ధి జరిగే అవకాశం ఉంటుందంటున్నారు. ఫోర్‌లైన్‌ను చీమకుర్తి పట్టణంలో నుంచే నిర్మించాలని ఆకాంక్షిస్తున్నారు. అలా చేయాలంటే పట్టణంలోని వ్యాపార సముదాయాలను రోడ్డుకు ఇరువైపులా 30–50 అడుగుల వెడల్పున కోల్పోయే ప్రమాదం ఉంటుంది. దీంతో మరికొందరు ఫోర్‌లైన్‌ను పట్టణంలో నుంచి కాకుండా ఊరు బయట బైపాస్‌వైపే నిర్మించాలని విజ్ఞప్తి చేస్తున్నారు. ఇంకొంత మంది మాత్రం బైపాస్ వైపు ఫోర్ లైన్ నిర్మిస్తే ఇప్పుడున్న బైపాస్‌ను ఆనుకుని ఉన్న విలువైన స్థలాలు పోతాయని ఆందోళన చెందుతున్నారు. ఇక, సంతనూతలపాడు, పొదిలి పట్టణంలో నుంచి కాకుండా ఊరి బయట నుంచి బైపాస్‌లతో ఫోర్‌లైన్ నిర్మించాలని భావిస్తున్నారు.

పీపీపీ పద్ధతిలోనే ఫోర్‌లైన్ నిర్మాణం

ఒంగోలు నుంచి బేస్తవారిపేట వరకు దాదాపు 113 కిలోమీటర్ల పొడవున ఫోర్‌లైన్ నిర్మించనున్నాము. పీపీపీ పద్ధతిలో టెండర్లు పిలుస్తారు. ప్రస్తుతం సర్వే నిర్వహించి ఎంత ఖర్చవుతుంది, సేకరించాల్సిన భూమి ఎంత వంటివి పూర్తయ్యాక టెండర్ల ప్రక్రియ జరుగుతుంది.

– రామ్‌నాయక్, ఆర్అండ్‌బీ ఎస్ఈ, ఒంగోలు

ఉత్తరం వైపు కట్టపై నిర్మించేందుకే ఆర్అండ్‌బీ అధికారుల మొగ్గు...

ఆర్అండ్‌బీ అధికారులు మాత్రం చీమకుర్తిలో సాగర్ కాలువపై ఉత్తరం వైపున్న కట్టపై ఇప్పుడున్న డబుల్ లైన్ బైపాస్‌ను ఆనుకునే ఫోర్‌లైన్ నిర్మించేందుకు మొగ్గు చూపుతున్నారు. దక్షిణం వైపు నిర్మిస్తే కాలువ కట్టపై ఎంట్రెన్స్‌లో, ఎండింగ్‌లో రెండు వంతెనలు నిర్మించాల్సి వస్తుందని, అది అదనపు ఖర్చని అంటున్నారు.

పీపీపీ పద్ధతిలోనే నిధుల సేకరణ...

పేరుకు ఫోర్‌లైన్ అని ప్రభుత్వం అట్టహాసంగా ప్రకటించినప్పటికీ దానిని నిర్మించేందుకు కావాల్సిన నిధులను పబ్లిక్, ప్రైవేట్ పార్టనర్‌షిప్ (పీపీపీ) పద్ధతిలో సేకరించాలని నిర్ణయించారు. నిర్మించే కాంట్రాక్టర్ టెండర్‌లో వర్క్ ఆర్డర్ దక్కించుకున్న తర్వాత నిర్మాణం పూర్తయ్యాక ఒంగోలు నుంచి బేస్తవారిపేట వరకు టోల్‌ప్లాజాలు ఏర్పాటు చేసి రోడ్డు నిర్మాణానికి పెట్టిన డబ్బును వడ్డీతో సహా వసూలు చేసుకునే వెసులుబాటు కల్పించనున్నారు. దీంతో ఫోర్‌లైన్ నిర్మించిన తర్వాత వాహనదారులపై భారం పడే అవకాశం ఉంది.


సాగర్ కాలువ కట్టపై ఉన్న చీమకుర్తి బైపాస్ రోడ్డు